క్లుప్తంగా

64 మందికి నేత్ర పరీక్షలు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో సోమవారం మార్కాపురం ఎల్‌వీ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 64 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కె.మల్లేష్ మాట్లాడుతూ కంటి లోపం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి అద్దాలు కూడా అందజేస్తామన్నారు. స్థానిక వైద్యశాల సీహెచ్‌ఎం కేవీ చెన్నయ్య, కార్యదర్శి ఆచారి, డాక్టర్లు తిరుమల కొండ, నాగరాజు, ఏఎన్‌ఎం భాగ్యమ్మ, పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల, గ్రామ స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సెల్ టవర్ నిర్మాణం అడ్డగింత

పామూరు: స్థానిక ఎన్‌జీవో కాలనీలో నివాస గృహాల మధ్యలో జియో సెల్‌టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆ కాలనీవాసులు సోమవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. 4వ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్, పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని, టవర్ ఏర్పాటు వల్ల సమీప గృహాలకు చెందిన ప్రజలు క్యాన్సర్, ఇతర వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. నిర్మాణాన్ని ఆపకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి

హనుమంతునిపాడు: రైతులంతా వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి వరి పంటలో తెగుళ్లను నివారించవచ్చనని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ సూచించారు. మండలంలోని సీతారాంపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని దొడ్డిచింతల, ఉపేంద్రపురం గ్రామాల్లో వరి పంటలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంటకు సోకిన తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో వీఏఏ కె.నవ్య, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు గొడుగుల పంపిణీ

కనిగిరి రూరల్: బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు గ్రంధి శ్రీకాంత్, లక్ష్మీప్రతిమ ఆర్థిక సహాయంతో పట్టణంలోని 20వ వార్డులో గల అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, బొగ్గులగొందికాలనీ, బీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని సుమారు 100 మంది చిన్నారులకు రూ 20 వేల విలువ చేసే గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో వాగిచర్ల వెంకటేశ్వర్లు, పసుపులేటి అరుణోదర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బొగ్గవరపు శ్రీనివాసులు, కే బాబూరావు, మాంటిస్సోరి పిచ్చిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త కే సుశీల, అంకమ్మ, చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌ను భూమి లోపల వేయాలి

పామూరు: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి వేస్తున్న కుళాయి పైప్‌లైన్‌ను రోడ్లపై కాకుండా, నేల అంతర్భాగంలో వేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ కోరారు. ఆ మేరకు సోమవారం ఈవోఆర్డీ వి.బ్రహ్మనందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వజ్రాల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ ఉపాధి కూలీలకు క్షేత్రస్థాయిలో పనులు కల్పించడంలో ఎఫ్‌ఏలు, టీఏలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చేసిన పనులకు తగు వేతనం కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఏ ఏ గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి, ఎంత మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారనే దానిపై క్షేత్ర స్థాయి అధికారులు కచ్చితమైన నివేదికలు ఇవ్వాలని సూచించారు. పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం జీ షారోన్ పుష్పరాణి, సీహెచ్ కిషోర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి



కనిగిరిలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం



పామూరు: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

● ఘనంగా గాంధీ వర్ధంతి

మహనీయుల ఆశయాలు సాధించాలి

కనిగిరి రూరల్: మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయడమే వారికి నిజమైన నివాళి అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో సోమవారం గాంధీజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ చేసిన పోరాటాన్ని కొనియాడారు. గాంధీ చూపిన అహింసామార్గం అనుసరణీమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీలు జిలాని, జానీ, కౌన్సిలర్లు దేవరాజ్, అబ్రహం లింకన్, వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, కంటు గురవయ్య, గోపాల్, సర్పంచ్‌లు గోవిందరెడ్డి, మల్లెల యాకోబు, మాలీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

సాయి కృష్ణ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు దోసపాటి నర్సయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా పీర్, రెడ్డి సంధ్య, గౌరవాధ్యక్షుడు యలమంద, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం...

పామూరు: జాతిపిత మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి, ప్రజాసంఘాల నాయకుడు జొన్నలగడ్డ గోవిందయ్య అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో సీఎస్ పురం రోడ్డు, వాసవీమాత ఆలయం వద్ద మహాత్ముని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, షేక్ నాయబ్‌రసూల్, శ్రీరాం శ్రీను, సూరిపోగు మాల్యాద్రి, పాలేటి ప్రేమ్, పూనాటి ప్రభాకర్, మాజీ సర్పంచ్ డి.వి.మనోహర్, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు యేల్చూరి బాలకొండలు, కోటా సురేష్, ముప్పసాని రాఘవ, కొత్తూరి హరగోపాల్, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

గాంధీజీ బాటలో నడవాలి

పొన్నలూరు: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల్లో గాంధీజీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వెలగపూడి శ్రీనివాసులు, హెచ్‌ఎం బి.వెంకట్రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్ చిరంజీవిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టంగుటూరు పట్టణ 6వ వార్డు ఇన్‌చార్జి పేరూరి కమలాకర్, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గ్రంథాలయంలో నిర్వాహకుడు గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అందరినీ ఏకం చేసిన మహనీయుడు గాంధీజీ

కందుకూరు అర్బన్: కుల మతాలకు అతీతంగా దేశంలో అందరినీ ఒక తాటిపైకి తెచ్చి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం గాంధీ 75వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ తల్లపనేని వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె. రఫీ, చింతపూడి మోహన్‌రావు, ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి శివ, మురారిశెట్టి శ్రీకాంత్, చక్కా వెంకట కేశవరావు, తొట్టెంపూడి శ్రీనివాసరావు, కోట నరసింహం, అల్లూరయ్య, కొత్త ప్రసాద్, రహీం, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరులో..

గుడ్లూరు: జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతిని మండల కేంద్రమైన గుడ్లూరులో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాసులు, కార్యదర్శి గరటయ్య, సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్న, రాంబాబు, రాజా, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాఘవులు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



పొన్నలూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకటకేశవరావు, సిబ్బంది



టంగుటూరులో గాంధీకి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.12 లక్షలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,12,212 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.50,730, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.26,670, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలిచ్చిన విరాళం రూ.19,464, స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహణకు దాతలిచ్చిన విరాళం రూ.15,348 వచ్చినట్లు చెప్పారు. అందులో శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు లింగసముద్రం మండలం సింగరపాలెం గ్రామానికి చెందిన చాగం నాగిరెడ్డి, చిన్నమ్మ దంపతులు రూ.10,116 విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

హుండీల ద్వారా రూ.6.44 లక్షల ఆదాయం...

హుండీల ద్వారా మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి రూ.6,44,043 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయంలోని హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.6,44,043 నగదుతో పాటు 3 కేజీల 779 గ్రాముల వెండి, 123 గ్రాముల బంగారం వచ్చినట్లు తెలిపారు. రెండు నెలల ఐదు రోజుల కాలంలో ఈ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో కోవిలంపాడు ఎంపీటీసీ గోను సరస్వతీ వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు మంచికంటి మధుసూదన్‌రావు, జిలకర అంజనాదేవి నారాయణమూర్తి, ఎలికా నాగమణి నాగేశ్వరరావు, ముడుమాల నారాయణరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

హెచ్‌ఎంపాడులో సైన్స్ ప్రదర్శనశాల

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో సోమవారం మండల స్థాయిలో సైన్సు ప్రదర్శనశాల ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్సు ప్రాజెక్టులను తిలకించారు. మండలంలోని ఏడు జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు, కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థులు తయారు చేసిన నీటి సంరక్షణ, మోడల్ హౌస్, ప్లాస్టిక్ వ్యర్థాలు, సంయుక్త వ్యవసాయం, సోలారు సిస్టం, హైడ్రానిక్ మిషన్, లేజర్ సీక్రెట్ అలారం, పొగమంచు నిర్మూలన, వీధి దీపాలు, పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్ తదితర పరికరాలను సైన్సు ప్రదర్శనలో ఉంచారు. ఎంపీడీవో జీవీ క్రిష్ణారావు, ఎంఈవో జి.పెద్దిరాజు పరిశీలించారు. సైన్సు ప్రయోగాల గురించి విద్యార్థులను అడిగి వాటి ఉపయోగాలు, పనిచేసే విధానం గురించి తెలుసుకున్నారు. సైన్సు ప్రదర్శనలో హనుమంతునిపాడు విద్యార్థులకు మొదటి బహుమతి, మహమ్మదాపురం విద్యార్థులకు రెండో బహుమతి, నీటి సంరక్షణ తయారీపై కస్తూరిబా బాలికలకు, అంకెల ఇళ్లు తయారీపై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూళ్ల హెచ్‌ఎంలు జీవీ సురేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, ఎస్.రమణయ్య, ఎస్‌వో సుశీల, నారాయణరెడ్డి, సుబ్బారావు, ప్రసాదురెడ్డి, పరిశీలకులు ప్రభాకర్, జిలాని, సైన్సు టీచర్లు, ఫిజిక్స్ టీచర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్సు ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎంఈవో

అంకమ్మ తల్లి దేవాలయానికి రూ.1,00,116 విరాళం

కందుకూరు అర్బన్: కందుకూరు గ్రామ దేవత శ్రీ అంకమ్మ దేవాలయం పునః నిర్మాణంలో భాగంగా కుంచాల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ధర్మపత్ని వెంకటరత్నం, కుమారుడు శ్రీనివాసులు, కోడల విజయలక్ష్మి రూ.1,00,116 నగదును కమిటీ సభ్యుడు వెంకటరెడ్డికి అందజేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని ఆకాంక్షించారు.



అమ్మవారికి విరాళం అందజేస్తున్న వెంకటేశ్వర్లు బంధువులు

సంక్షిప్తంగా

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత ఉండాలి

పొన్నలూరు: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు నాణ్యంగా ఉండాలని ఏపీఓ మాచర్ల సూచించారు. మండలంలోని విప్పగుంట గ్రామంలో సరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది రోజూ పని ప్రదేశాన్ని పరిశీలించి, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో టీఏ విజయచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదులో జాగ్రత్తలు పాటించాలి

సీఎస్ పురం: ఈ క్రాపు నమోదు సమయంలో ఆర్‌బీకే సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి కంచెం రాధ సూచించారు. ఈ క్రాపు సూపర్ చెకింగ్‌లో భాగంగా మండలంలోని చెన్నపునాయునిపల్లి, వీ బైలు, రేగులచెలక, అయ్యలూరివారిపల్లి, బోయమడుగుల, వెంకటాయచెరువు తదితర గ్రామాల పరిధిలో ఈ క్రాపు నమోదును సోమవారం ఆమె పరిశీలించారు. రబీ సీజన్‌లో సాగుచేసిన వరి పంట ఈ క్రాపు నమోదును సర్వే నంబర్ల వారీగా పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ చిరంజీవి, ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

28 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఆర్‌ఎస్ ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆర్‌ఎల్‌వీ చంద్రశేఖర్ 28 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు చేసి కళ్లజోళ్ల మంజూరుకు సిఫార్సు చేశారు. ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ, ఏఎన్‌ఎం నాగమణి, శ్రీహరి, రాఘవేంద్రరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆధార్ నమోదు

ఉలవపాడు: ఆధార్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్న చాగల్లు ఇందిరానగర్ గిరిజన కాలనీ వాసులు 100 మందికి సోమవారం ఆధార్ కార్డులు నమోదు చేశారు. యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ అధికారుల సహకారంతో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. యానాదులకు ఈ ఆధార్ సమాచారం నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, యానాది సంఘం జిల్లా నాయకులు రాకేష్ బాబు, బాపట్ల వెంకటరావులు పాల్గొన్నారు.

పేదల పాలిట వరం.. వైఎస్సార్ బీమా



బీమా నగదు అందజేస్తున్న నాయకులు, అధికారులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పథకం పేద వర్గాల పాలిట వరమని మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే రహీం అన్నారు. మండలంలోని తాళ్లూరులో వాణి అనే మహిళ మృతి చెందగా, మట్టి ఖర్చుల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మూలె మాలకొండారెడ్డి, మాజీ సర్పంచ్ గురు బ్రహ్మారెడ్డి, కార్యదర్శి అంకమ్మరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి రేషన్ పంపిణీ చేయాలి

లింగసముద్రం: ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకులను ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందజేయాలని తహసీల్దార్ సుధాకరరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బియ్యం, పంచదార, కందిపప్పును ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే విక్రయించాలన్నారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లైతే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ హనుమాయమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఈకేవైసీ పూర్తి చేయాలి

పీసీ పల్లి: పంటలు వేసిన రైతులంతా ఈ నెలాఖరులోపు ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి తెలిపారు. మండల పరిధిలోని పెదఅలవలపాడు ఆర్‌బీకే పరిధిలో వరి పంట ఈక్రాప్ నమోదును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట వేసిన రైతులు ఈ నెలాఖరులోపు సమీపంలోని ఆర్‌బీకేలో నమోదు చేయించుకోవాలని, మిగతా పంటలు వేసిన వారు ఫిబ్రవరి మొదటివారంలోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు చేపల వేటకు లైసెన్స్ ఇవ్వడంపై హర్షం

కందుకూరు అర్బన్: మైదాన ప్రాంత ఐటీడీఏ పరిధిలో ఎస్టీ లైన యానాది, ఎరుకుల, చెంచు నక్కల, లంబాడి తెగలవారికి చేపల వేటకు లైసెన్స్‌లు ఇవ్వడంపై నెల్లూరు జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి జగన్నతం వైకుంఠం హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులకు చేపల లైసెన్స్‌లు ఇవ్వడమే కాకుండా వారికి చేపల పెంపకంపై అవగాహన, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి ఎస్టీలకు జీవనోపాధితో పాటు సంక్షేమ ఫలాలను చేరువ చేయాలని ప్రభుత్వాని కోరారు.

స్పందనకు 12 అర్జీలు

కందుకూరు అర్బన్: కందుకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. రెండో వార్డుకు చెందిన మన్నవ సామ్రాజ్యమ్మ తన సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని, 4వ వార్డులో తొలగించిన పింఛన్‌ను పునరుద్ధరించాలని యక్కిటపల్లి సుబ్బరత్తమ్మ కోరినట్లు కమిషనర్ తెలిపారు. 7వ వార్డుకు చెందిన బత్తిన కోటయ్య ఇంటి కొలతలు ఆన్‌లైన్‌లో ఎక్కువగా నమోదయ్యాయని, వాటిని సరిచేసి కొలతలు తగ్గించాలని కోరారన్నారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ హరిబాబు

పామూరు: కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించి భాగస్వాములు కావాలని మండలంలోని బొట్లగూడూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హరిబాబు సూచించారు. స్పర్శ పక్షోత్సవాల్లో భాగంగా కుష్టువ్యాధిపై స్థానిక బొట్లగూడూరు సచివాలయంలో సోమవారం ఎంపీటీసీ, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరగనున్న స్పర్శ పక్షోత్సవాల్లో భాగంగా కుష్టువ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మురళీకృష్ణ, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్ పురంలో...

సీఎస్ పురం: కుష్టు వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఎస్.మురళి సూచించారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కె.అగ్రహారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి మురళి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి లక్షణమన్నారు. అటువంటి మచ్చలు కనిపిస్తే వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. నరాలు గట్టి పడటం, క్లియర్ పాజిటివ్ రావడం కూడా కుష్టు వ్యాధి లక్షణమే అని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎంవో కె.ప్రసాదరెడ్డి, లెప్రసీ నోడల్ ఆఫీసర్ వై.బాలకొండయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన నీటి సరఫరా

గుడ్లూరు: మండలంలోని పెదలాటఫి గ్రామంలో ఐదు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న మంచినీటి పథకం మోటారు వైర్లు కాలిపోయి మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామంలో ఐదు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో ఉన్న 120 కుటుంబాల వారికి ఈపథకం నుంచే నీరు సరఫరా అవుతుంది. దీంతో మంచి నీటి కోసం నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సాయి ధీమంత్‌కు అభినందన

ఉలవపాడు: రాష్ట్ర స్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరచిన కందుకూరు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి బెజవాడ వెంకటసాయి ధీమంత్‌ను పలువురు అభినందించారు. ఐఈఎస్ డిఫెన్స్ అకాడమీ మెంబరు పాపయ్య, ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నంభాస్కరరావు అభినందనలు తెలిపారు. జనవరి 28, 29, 30 వ తేదీల్లో దొనకొండ లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రకాశం జట్టు క్వార్టర్ ఫైనల్స్ వరకు రావడంలో మంచి ప్రతిభ కనబరిచారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పొన్నలూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకుపాలెం గ్రామానికి చెందిన చొప్పర రవి రోజూ మాదిరిగానే ఈ నెల 27న పనికి వెళ్లాడు. అయితే సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో కుటుంబ సభ్యులు విచారించారు. రవి ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి రాజారావు సోమవారం తెలిపారు.